పాత పద్ధతిలో కార్మికులను కొనసాగించాలి

నాలుగో రోజుకు ఎపి సీడ్స్ కార్మికుల రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఎపి సీడ్స్‌లో అక్రమ టెండర్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్, సీడ్స్ కార్మికుల యూనియన్ అధ్యక్షులు టి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎపి సీడ్స్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి నాలుగో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా కార్మికుల పొట్టకొట్టడం అన్యాయమన్నారు. హమాలీ కార్మికుల మీద రాజకీయ కక్షతో వ్యవహరించడం బాధాకరమన్నారు. అక్రమ టెండర్‌ను రద్దు చేసి పాత పద్ధతిలో కార్మికులను కొనసాగించాలని, కక్ష సాధింపు ఆపాలని, కార్మికుల హక్కులు అమలు చేయకుండా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి.త్రిమూర్తులు, రమణ, శ్రీహరి, సూరిబాబు, సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై రైతులు ఆగ్రహం

సరిపడా సంచులు ఇవ్వడం లేదని ఆవేదన

వంద సంచులు అడిగితే 92 సంచులతో సరి

రబీలో ఎకరాకు 50 నుంచి 60 బస్తాల దిగుబడి

ఇబ్బందులు పడలేక బస్తా రూ.1400కు తెగనమ్ముతున్న రైతులు

ప్రతిగింజా కొంటాని చెప్పి.. టార్గెట్‌లు సరికాదంటున్న రైతులు

చినిగిన సంచులతో తీవ్ర ఇబ్బందులు

బాగాటి చిన్నారావు, రైతు కొవ్వలి

40 ఎకరాల్లో వరి పంట సాగుచేశాను. 22 ఎకరాల్లో మాసూలు పూర్తయ్యి 15 రోజులవుతోంది. ధాన్యం కొనుగోలు ఆలస్యంగా ప్రారంభించడంతో ఇబ్బందులు పడ్డాం. ఎకరాకు 92 సంచులే ఇచ్చారు. అందులో 15 సంచులు చిరిగిపోయినవి ఉంటున్నాయి. దీంతో ధాన్యం కిందకు కారిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నాణ్యమైన సంచులు ఇవ్వాలి.

వంద సంచులిస్తేనే సరిపోతాయి

డి.కేశవ, రైతు, బొమ్మిడి గ్రామం

సాగు చేసిన పది ఎకరాల్లో వరి మాసూళ్లు పూర్తయ్యాయి. ఎకరాకు 92 సంచులే ఇచ్చారు. కనీసంగా వంద సంచులు ఇస్తేనే సరిపోతాయి. సంచులు సరిపడా ఇవ్వకపోతే మిగిలిన ధాన్యం మరోసారి ఎలా అమ్మాలి. వంద సంచులిచ్చి ధాన్యం కొనుగోలు చేయాలి. ధాన్యం బస్తాల్లో పట్టేసినా లారీలు ఇంకా రాలేదు. త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

వంద సంచులిచ్చి ధాన్యం కొనండి..!

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై రైతుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం రబీలో ఎకరాకు 75కిలోల బరువుగలవి 50 నుంచి 60 బస్తాల దిగుబడి వస్తోంది. ఈ దిగుబడికి సరిపడా సంచులు కావాలంటే ఖచ్చితంగా వందసంచులు రైతులకు అందించాలి. ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. పంట పండించడమే తప్పు అన్నట్లు మాట్లాడుతోంది. నిన్నటి వరకూ 40 కిలోల ధాన్యం తూగే 75 సంచులు మాత్రమే ఇస్తామంటూ చెప్పుకొచ్చింది. ఎకరాకు వంద సంచులు ఇవ్వాలంటూ రైతుల నుంచి పెద్దఎత్తున డిమాండ్ రాగా అందులోనూ కోతలు విధిస్తూ బుధవారం నుంచి 92 సంచులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటుంది. 40 కిలోల తూకం వచ్చే 92 సంచులు ఇస్తే కేవలం 49 బస్తాలకు మాత్రమే సరిపోతాయి. మరి మిగిలిన పంట పరిస్థితి ఏమిటంటూ రైతులు ప్రశ్నిస్తున్నా సమాధానం చెప్పేవారే లేకుండాపోయారు. రెండు జిల్లాల్లో రబీలో మూడు లక్షలకుపైగా ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారు. గడిచిన పదిరోజులుగా మమ్మురంగా రైతులు రబీ మాసూలు చేస్తున్నారు. గడిచిన ఆదివారం వరకూ ధాన్యం కొనుగోలు చేయకుండా తాత్సారం చేశారు. దీంతో రైతులు అయినకాడికి దళారులకు అమ్ముకున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం 75 కిలోల బస్తాకు రూ.1530 రైతులకు ఇవ్వాల్సి ఉంది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు తెరవడం ఆలస్యం కావడం, తెరిచినప్పటికీ సంచులు సరిపడా ఇవ్వకపోవడంతో రైతులు బస్తా ధాన్యం రూ.1400కే దళారులకు అమ్ముకుంటున్నారు. సంచులు సరిపడా ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలంటూ రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎకరాకు 92 సంచులు ఇస్తే అందులో 15 సంచులు పనికిరానివిగా ఉంటున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. సంచులన్నీ చిరిగిపోవడంతో ధాన్యం పారు ఎక్కువగా ఉంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే క్రమంలో లారీలు సైతం ఇంకా సరిగా ప్రారంభం కాకపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటి వరకూ రైతుభరోసా కేంద్రాలకు పండిన పంటలో 20 శాతానికి మాత్రమే సంచులు చేరాయి. మిగిలిన సంచులు త్వరితగతిన ఇస్తారా లేక మళ్లీ ఖరీఫ్‌లో మాదిరిగా ఇబ్బందులకు గురిచేస్తారా అన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

కొనుగోలులో టార్గెట్లు ఎందుకు?

పండిన ప్రతిగింజా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ కొనుగోలుకు సంబంధించి మండలాల వారీగా టార్గెట్‌లు విధించి అధికారులతో అమలు చేయిస్తోంది. దీంతో రైతులకు ఏం చెప్పాలో తెలియక మండల వ్యవసాయ అధికారులు నలిగిపోతున్నారు. ప్రతి మండలంలోనూ 60 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేయాలని ఆదేశాలిచ్చిన పరిస్థితి నెలకొంది. టార్గెట్ పూర్తయిన తర్వాత ఆలోచిస్తామని ప్రభుత్వం చెప్పుకొస్తోంది. టార్గెట్ పూర్తయిన తర్వాత తాత్సరం చేస్తే రైతులు మరిన్ని ఇబ్బందులు పడే పరిస్థితి రానుంది. ప్రతిగింజనూ కొనుగోలు చేస్తామని చెప్పడం ఏమిటి? 60 శాతం ధాన్యమే కొనుగోలు చేయాలని టార్గెట్‌లు విధించడం ఏమిటో రైతులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వతీరు మారకపోతే రైతులు మున్ముందు మరిన్ని ఇబ్బందులు పడక తప్పదని చెప్పొచ్చు.

మోడీ వల్ల పేదలకు ఒరిగింది శూన్యం

సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్రలో నేతలు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ మండలంలో..

దేశానికి మంచి రోజులు తీసుకువస్తానని మాయమాటలు చెప్పిన మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా చేసింది ఏమీ లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జరుగుతున్న ప్రచార భేరి యాత్ర బుధవారం పెనుగొండ అంబేద్కర్ కాలనీ, బైపేవారిపేటలో సాగింది. అనంతరం పెనుగొండ గోంగూరతూము సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో టీ అమ్మాను అని చెప్పుకున్న మోడీ నేడు దేశాన్నే అమ్మకానికి పెట్టారని విమర్శించారు. ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీలపై రాష్ట్రంలో దాడులు చేస్తున్న బిజెపిని నిలదీయకుండా వైసిపి, ప్రతిపక్ష టిడిపి, జనసేనలు మోడీ కొమ్ము కాసే వైఖరిని ప్రశ్నించారు. మోడీ మతోన్మాద విధానాలు దేశ ప్రజల మధ్య చీలికలు తీసుకువచ్చాయని, ప్రజలపై మోయలేని భారాలు విధిస్తూ, అంబానీ ఆదానీలకు దోచి పెడుతున్నారని విమర్శించారు. తనకు 25 ఎంపీ సీట్లు ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదాను మోడీ మెడలు వంచి తీసుకువస్తానని చెప్పిన జగన్ నెలకు ఒకసారి వెళ్లి మోడీ, అమిత్‌షాల ముందు తన మెడలే వంచి వస్తున్నాడని విమర్శించారు. మోడీ భజనమాని వైసిపి ప్రభుత్వం, టిడిపి జనసేన పార్టీలు ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లాకార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, పెనుగొండ మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు, గుర్రాల సత్యనారాయణ, మాదాసు నాగేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, నీలాపు ఆదినారాయణ, శీలం ఏసు, గెద్దాడ శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం:బిజెపి అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక, నిరంకుశ, మతోన్మాద విధానాలను ప్రతిఒక్కరూ ఎండగట్టాలని సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్ర పిలుపునిచ్చింది. ఈ యాత్ర ఆరో రోజు బుధవారం తాడేపల్లిగూడెం మండలం ప్రత్తిపాడు గ్రామంలో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, సిపిఐ పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, సిపిఎం పట్టణ నాయకులు కరెడ్ల రామకృష్ణ మాట్లాడారు. ఈ యాత్రలో కాసాని శ్రీను, అల్లంకి రాము, జవ్వాది శివ, శిద్దిరెడ్డి శేషుబాబు, చిట్టేటి సత్యనారాయణ, పోతు శ్రీను, అల్లం రాము, దాస్యం రాము, రావూరి బాబీ, కోరాడ వెంకటేశ్వరరావు, ఉయ్యూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

భీమవరం:సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార భేరియాత్ర స్థానిక ఆరోవార్డు బొక్కవారిపాలెంలో సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. కార్పొరేట్లకు అనుకూలంగా అదానీ, అంబానీలకు ఊడిగం చేస్తూ ప్రజల సొమ్మును వాళ్లకి ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. బొక్కవారిపాలెం, సౌభాగ్యనగర్, నెహ్రూ కాలనీ, రజకుల కాలనీ, కంజువారిపేట, మల్లతోట ప్రాంతాల్లో యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారామ్‌ప్రసాద్, సిపిఎం జిల్లా నాయకులు ఎం.వైకుంఠరావు, బొక్క సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, రాము, డి.త్రిమూర్తులు, డి.నాగు, కె.కృష్ణ, అంజి, కోదండ నాగేశ్వరరావు, నాగరాజు, గాలి బాబు, గుడాల శ్రీను, శ్రీరామ పాల్గొన్నారు.

పెంటపాడు మండలంలో..

పెంటపాడు : సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచార యాత్రను మండలంలో సిపిఎం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు చింతకాయల బాబూరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఎం మండలం కార్యదర్శి సిహెచ్.పుల్లారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కె.లక్ష్మణరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రంగారావు మాట్లాడారు. యాత్ర బి.కొండేపాడు, రామచంద్రపురం, విల్లూరు, చింతపల్లి, కోరుమిల్లి, యానాలపల్లి, కె.పెంటపాడు, ముదునూరు, రావికుంట, బిళ్లగుంట, బోడపాడు తదితర గ్రామాల్లో యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో నాయకులు బొంకుర నాగేశ్వరరావు, బుడబళ్ల లక్ష్మీనారాయణ, సత్తి శ్రీనివాసరెడ్డి, మద్దాల భీముడు, మీసాల శ్రీనివాస్, దుర్గ, కె.నాగరాజు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ :కేంద్రంలో మోడీ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రభుత్వరంగ సంస్థలను, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను ప్రజలందరూ వ్యతిరేకించాలని సిపిఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని వెంప, శ్రీరామపురం గ్రామాల్లో సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్ర సాగింది. ఈ కార్యక్రమంలో తోటి శుభాకర్‌రావు, పోలుకొండ కుటుంబరావు, మంద చిట్టిబాబు, దీపాటి పెద్దిరాజు, మంద ఏసు, కుచ్చినపల్లి దావీదు, భవాని, అవ్వమ్మ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరి యాత్ర బుధవారం ఉప్పరగూడెం, జగన్నాధపురం, మాధవరం, అప్పారావుపేట, గొల్లగూడెం, మోదుగుంట, మెట్టఉప్పరగూడెం, లింగారెడ్డిగూడెం గ్రామాల్లో సాగింది. ఈ యాత్రలో సిపిఎం నాయకులు కండెల్లి సోమరాజు, సిపిఐ నాయకులు ఉల్లింకల జయకృష్ణ, మాట్లాడారు. ఈ నెల 21వ తేదీన తాడేపల్లిగూడెం ఎన్‌కె గ్రౌండ్‌లో జరిగే ముగింపు సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ, సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నాయకులు బాలకృష్ణ, గోపాల వెంకటరావు, కండెల్లి రమేష్ బాబు, చింతల పోతురాజు పాల్గొన్నారు.

లంక భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలి

ప్రజాశక్తి - భీమవరం

యలమంచిలి మండలం చించినాడలో దళితులకు చెందిన లంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలను ఆపకపోతే దళిత ప్రజాసంఘాలు ఐక్యంగా 'చలో లంక భూముల్లోకి' పిలుపునిస్తామని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంఎల్‌ఎ దిగుపాటి రాజగోపాల్ హెచ్చరించారు. బుధవారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో లంక భూముల్లో అక్రమ తవ్వకాలు ఆపాలని కోరుతూ కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వ్యకాస జిల్లా కార్యదర్శి జెక్కంశెట్టి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ యలమంచిలి మండలం చించినాడలో దళిత పేద కుటుంబాలకు చెందిన లంక భూముల్లో అధికారులు అక్రమ తవ్వకాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. చించినాడలో ఎస్‌సి, బిసి కుటుంబాలకు చెందిన 60 ఎకరాల భూములకు 1983లో ప్రభుత్వం పట్టాలిచ్చిందని తెలిపారు. ఆ భూముల్లో వాణిజ్య పంటలు సాగు చేసుకునే వారన్నారు. ఆక్వా వల్ల సరుగు చెట్లు కూడా పండేవి కాదన్నారు. కోవిడ్ అనంతరం ఆక్వా చెరువుల ప్రభావంతో ఉమ్మడిగా ఆక్వా సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో గోదావరి వల్ల పది ఎకరాల భూమి పెరిగిందని చెప్పారు. ఈ భూమి పేద దళిత కుటుంబాలు ఉపయోగించుకుంటున్నారని, అక్కడ భూస్వాములు, అధికారులు అక్రమంగా ఆ పది ఎకరాల భూమిని తవ్వి మట్టిని తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భూస్వాముల చేతుల్లో ఉన్న వందలాది అక్రమ భూములను వదిలేసి కేవలం దళితులు, బిసిల భూములను మాత్రమే లక్ష్యం చేసుకుని అధికారులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తహశీల్దార్ ప్రధాన పావుగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని హైకోర్టులో కేసు వేస్తే స్పందించిన న్యాయస్థానం మట్టి తవ్వకాలను ఆపాలని ఆర్డర్ ఇచ్చిందన్నారు. అయినా హైకోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, కొందరు రాజకీయ నాయకులు పోలీసు పహారా పెట్టి అక్రమంగా మట్టి తవ్వకాలను చేపడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్, ఎపి బహుజన జెఎసి రాష్ట్ర ఫౌండర్ తాళ్లూరి మధు మాట్లాడుతూ దళితుల భూముల్లో అధికారులు దౌర్జన్యం చేయడం దారుణం అన్నారు. దీనిపై ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్‌ప్రసాద్‌తో భూముల్లో పర్యటిస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులు, పేదలు అభివృద్ధి చెందాలంటే భూమి అనేది కీలకమని అంబేద్కర్ ఆశించారని గుర్తు చేశారు. కానీ నేడు దళితుల చేతుల్లో ఉన్న కొద్దిపాటి భూమిని కూడా యంత్రాంగం ప్రజాప్రతినిధులు లాక్కోవాలని చూడటం దారుణమన్నారు. ప్రశ్నిస్తే పోలీసులతో దౌర్జన్యం చేస్తారా అని ప్రశ్నించారు. లంక భూముల పరిరక్షణ పోరాటానికి సిఐటియు సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ లంకపరివాహక ప్రాంతాల్లో వందలాది ఎకరాల పెరుగుదల భూములు భూస్వాముల చేతుల్లో ఉన్నాయన్నారు. వాటిని ఏమాత్రమూ పట్టించుకోని తహశీల్దార్, సబ్‌కలెక్టర్ కేవలం దళితుల చేతుల్లో ఉన్న పది ఎకరాల భూమి కోసం వందలాది మంది పోలీసులతో దళితులను భయభ్రాంతులకు గురిచేయడం సబబు కాదన్నారు. దళిత ప్రజాసంఘాలతో కలెక్టర్ ప్రశాంతిని కలిసి వినతిపత్రం అందజేయాలని, సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానించిందని క్రాంతి బాబు తెలిపారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా నాయకులు జి.జేమ్స్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, మాజీ కౌన్సిలర్, దళిత నాయకులు పాలపర్తి జోన, ప్రముఖ న్యాయవాది, దళిత నాయకులు స్టాలిన్, కెవిపిఎస్ జిల్లా నాయకులు కానేటి బాలరాజు, చించినాడ గ్రామస్తులు గొల్ల ఏడుకొండలు, రైతు సంఘం నాయకులు వేండ్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలి

రాష్ట్ర శిశు సంక్షేమ శాఖా మంత్రి కెవి.ఉషశ్రీచరణ్

అంగన్‌వాడీ సెంటర్లను తనిఖీ చేస్తున్న మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా పిల్లల భవిష్యత్తే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని, అంగన్‌వాడీ ఉద్యోగులు విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ మంత్రి కెవి.ఉషశ్రీచరణ్ తెలిపారు. బుధవారం భీమవరం మండలంలోని విస్సాకోడేరు ప్రాజెక్టు పరిధిలోని యనమదుర్రు, దెయ్యాలతిప్ప, కోమటితిప్ప అంగన్‌వాడీ సెంటర్లను మంత్రి ఉషశ్రీ చరణ్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అంగన్‌వాడీ సెంటర్లలో హాజరు పట్టీని పరిశీలించి చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న పోషకాహారం, తదితర సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్త్రీ శిశ సంక్షేమ శాఖకు పెద్దపీట వేశారన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి, సిడిపిఒలు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసమే ఫ్యామిలీ డాక్టర్ : కలెక్టర్

ప్రజాశక్తి - తణుకురూరల్

తనిఖీ చేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం ప్రవేశపెట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. బుధవారం తణుకు మండలం వేల్పూరు పిహెచ్‌సి పరిధిలోని కొమరవరం గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కలెక్టరు ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాధిని గుర్తించడం గుర్తించిన వ్యాధిని తగ్గించేందుకు వివిధ రకాల వైద్య సేవలందించి మందులివ్వడం జరుగుతుందన్నారు. పిహెచ్‌సిలో ఉన్న ఇద్దరు డాక్టర్లు ఇంటింటికీ వెళ్లి పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఇస్తారని తెలిపారు. 108, 104 వాహనాలను బలోపేతం చేయడం, ఆరోగ్యశ్రీ అమలుచేయడంతో పాటు ఆరోగ్య ఆసరా కూడా అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డి.మహేశ్వరరావు, వైద్యాధికారులు డాక్టర్ కిషోర్, డాక్టర్ హరిణి, తహశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్, ఎఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దు : ఎస్‌పి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాట్లాడుతున్న ఎస్‌పి రవిప్రకాష్

అపరిచితులకు వ్యక్తిగత వివరాలు చెప్పొద్దని జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, సైబర్ నేరాలపై దృష్టి సారించామన్నారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించే విధంగా జిల్లా పోలీస్ యంత్రాంగం సేవలందిస్తున్నట్లు వివరించారు. చదువుకున్న వారు కూడా సైబర్ మోసాలకు గురవుతున్నారని తెలిపారు. ఆదమరిస్తే మూల్యం చెల్లించక తప్పదన్నారు. సైబర్ నేరాలపై అవగాహన పెంచుకుని ఇతరుల్లో అవగాహన కల్పించాలని కోరారు. గ్రామాలు, పట్టణాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో సైబర్ నేరాలపై అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా మొబైల్, ల్యాప్టాప్ వాడే యువతను సైబర్ మోసగాళ్లు టార్గెట్ చేస్తున్నట్లు వెల్లడించారు. చిన్న పిల్లలకు మొబైల్, ల్యాబ్‌టాప్ ఇచ్చినప్పుడు కనీస జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఆకివీడు : సైబర్ నేరాలపై అవగాహన అవసరమని సిఐ గీతా రామకృష్ణ తెలిపారు. బుధవారం జిల్లా ఎస్‌పి రవిప్రకాష్ తెలిపిన వివరాలను సిఐ తెలిపారు. ప్రధానంగా మొబైల్, ల్యాప్ టాప్ వాడే యువతను టార్గెట్ చేసుకొని మోసగాళ్లు సైబర్ నేరాలు సాగిస్తున్నారని వివరించారు. అపరిచితులకు వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దన్నారు. అందమైన అమ్మాయిల, అబ్బాయిల ఫొటోల ద్వారా ఫేస్‌బుక్, వాట్సప్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారం లో పరిచయమైన వారు చేసే వీడియో కాల్‌ను నమ్మొద్దన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వాసు

ప్రజాశక్తి - కాళ్ల



పాతపాటి వెంకట శ్రీనివాసరాజును సత్కరిస్తున్న క్షత్రియ ఫెడరేషన్ ప్రతినిధులు

వైసిపి బలోపేతానికి కృషి చేస్తానని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి వెంకట శ్రీనివాసరాజు (వాసు) అన్నారు. పాతపాటి సర్రాజు నివాసంలో క్షత్రియ ఫెడరేషన్ ప్రతినిధులు బుధవారం శ్రీనివాసరాజును కలిశారు. పాతపాటి సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన పాతపాటి వెంకట శ్రీనివాసరాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాతపాటి వాసు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి తాను జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియా ఫెడరేషన్ అధ్యక్షులు సిహెచ్.వెంకటపతిరాజు, భీమవరం క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు గాదిరాజు సుబ్బరాజు, పాలకొల్లు క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు బిహెచ్.విశ్వనాథరాజు, బిఎస్‌ఎన్‌ఎల్.రాజు, కాకినాడ, అమలాపురం, కైకలూరు క్షత్రియ సేవా సమితి అధ్యక్షులు పాల్గొన్నారు. అలాగే క్షత్రియ సేవా సమితి ప్రతినిధులంతా అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్రామాలాభివృద్ధికి ప్రభుత్వం కృషి : పివిఎల్

ఉండి:గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. బుధవారం పెదపుల్లేరు గ్రామంలో సుమారు రూ.11 లక్షలతో మండల పరిషత్ నిధులతో పాతకాలనీకి వెళ్లేందుకు నిర్మించిన గ్రావెల్ రోడ్డును పివిఎల్ నరసింహరాజు, మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అవసరమైన చోట రహదారులు వేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం రబీ సీజన్లో సుమారు 55 బస్తాల ధాన్యం కొనుగోలు చేస్తారని అనుకుంటే ఇప్పుడు కూడా 40 నుంచి 45 బస్తాలు మాత్రమే తీసుకుంటామని అధికారులు చెబుతున్నారని రైతులు పివిఎల్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన నరసింహరాజు మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారమయ్యేలా తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు, ఎంపిటిసి రాయి రావులమ్మ, గ్రామ అధ్యక్షుడు పప్పల రాంప్రసాద్, రాష్ట్ర జానపద సృజనాత్మక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు పాల్గొన్నారు.

సత్యనారాయణమూర్తి జీవితం స్ఫూర్తిదాయకం

తణుకు రూరల్:స్వాతంత్ర్య పోరాట యోధుడు కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి అని, ఆయన ఆదర్శవంతమైన జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు కొనియాడారు. అమరజీవి కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి 83వ వర్ధంతిని వేల్పూరులోని ప్రజాసంఘాల భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం, బాలల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రుద్రాక్షల శ్రీనివాస్, సోరపల్లి నిఖిల్, బళ్ల నాగలక్ష్మి, వీరభద్రరావు, తిప్పా హేమంత్ పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు రంజాన్ కానుక అందజేత

ప్రజాశక్తి - తణుకు

రంజాన్ మాసంలో నియమ నిష్ఠలతో ముస్లిం సోదరులు కఠిన ఉపవాసం ఉంటారని రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ముస్లిం సోదరులకు ఆయన సొంత ఖర్చులతో రంజాన్ కానుకను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ పండుగను ముస్లిం సోదరులు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. రంజాన్ కానుకను ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ ఈ కానుకను అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇమాములు ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

నేడు మంత్రిచే సగంచెరువు వంతెన ప్రారంభోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు

మండలం సగంచెరువు వద్ద ప్రక్కిలంక - నరసాపురం కాలువపై నిర్మించిన ఆర్అండ్‌బి వంతెన ప్రారంభోత్సవం ఎట్టకేలకు గురువారం జరుగునుంది. రూ.10 కోట్లతో నిర్మించిన ఈ వంతెన నిర్మాణం టిడిపి హయంలోనే 50 శాతం పూర్తయ్యింది. నాలుగేళ్లుగా నత్తనడకన పనులు జరుగుతూ ఎట్టకేలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా గురువారం సాయంత్రం ప్రారంభోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌తో పాటు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, ఆర్అండ్‌బి ఉన్నతాధికారులు పాల్గొనున్నారు.

21న ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

పెనుమంట్ర: ఈ నెల 21న తేదీన మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు తహశీల్దార్ దండు అశోక్ వర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమరాజు ఇల్లింద్రపులో ఉదయం 10.30 గంటలకు, పెనుమంట్రలో 11 గంటలకు, మార్టేరులో 11.30 గంటలకు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి), ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), సొసైటీ ధ్యక్షులు (మెంబర్లు), ఎంపిటిసిలు, గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, కౌలు రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

మహిళలకు చీరల పంపిణీ

ఉండి: పేదలకు సాయం చేయడంలోనే సంతృప్తి ఉందని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వికె.పంకజాక్షం అన్నారు. బుధవారం అధికారిక పర్యటనలో భాగంగా ఉండి లయన్స్ క్లబ్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు క్లబ్ అధ్యక్షులు గొట్టుముక్కల రాము అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పంకజాక్షం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని క్లబ్‌లూ దాదాపు పరిశీలించామన్నారు. ఉండి లయన్స్ క్లబ్ నిర్వహించే రికార్డులు, చేసిన సేవా కార్యక్రమాలను పరిశీలించారు. ముందుగా జెడ్‌సి ఆర్థిక సహకారంతో 20 మంది మహిళలకు చీరలు పంపిణీ, భవిత కేంద్రంలో వికలాంగులకు విద్యార్థులకు చిత్రలేఖనం మెటీరియల్, పడవలవాని పేట పాఠశాల విద్యార్థులకు కంచాలు, గ్లాసులు, రాష్ట్ర క్రీడాకారిణి శిరీషకు ఐదు వేలు ఆర్థిక సహాయం తదితర సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం రీజినల్ ఛైర్మన్ రుద్రరాజు వెంకట సూర్య నారాయణరాజు, జిల్లా కమిటీ సెక్రటరీ శ్రీహరి, గీతా పంకజాక్షం మాట్లాడారు. అనంతరం వారిని క్లబ్ తరపున సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కలిదిండి సీతారామరాజు, కోశాధికారి కన్నెగంటి రూత్ కళ, కూనపరాజు రామరాజు, రుద్రరాజు నరసరాజు, గాదిరాజు రంగరాజు, కాగిత మహంకాళి, సత్తి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

వెయ్యి మందికి ఒఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

పాలకొల్లు: పాలకొల్లు హృది ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వేసవి సందర్భంగా బుధవారం 1000 మందికి ఓఆర్‌ఎస్‌ఎల్ వాటర్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని పట్టణ సిఐ డి.రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు గాదె వెంకన్న, జాయింట్ సెక్రటరీ నార్కెడిమిల్లి కుమార్, ఆర్.సూర్యనారాయణ రాజు, ప్రసాద్, మదన్, కె.విశ్వనాథం, ట్రస్ట్ ట్రెజరర్ సబిత వెంకటరెడ్డి పాల్గొన్నారు.

నేడు సామాజిక చైతన్య పాదయాత్ర

పాలకొల్లు: ఈ నెల 20వ తేదీన చంద్రబాబు నాయుడు పుట్టినరోజు సందర్భంగా పాలకొల్లు అద్దేపల్లివారిసత్రం నుంచి గాంధీ బొమ్మల సెంటర్ మీదుగా నరసాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ సామాజిక చైతన్య పాదయాత్ర నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు బుధవారం అద్దేపల్లి వారి సత్రంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమాజంలో ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలు, బిసిలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించనున్నట్లు ఆయన మీడియాతో చెప్పారు. చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు సత్రంలో ఘనంగా నిర్వహిస్తామన్నారు. పేదలకు కాయగూరలు, ఇస్త్రీ బండ్లు ఉచితంగా అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, మామిడి శెట్టి పెద్దిరాజు, కోడి విజయభాస్కర్, కడలి గోపి, జివి పీతల శ్రీను పాల్గొన్నారు.

ఎస్‌కెఎస్‌డి డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

తణుకురూరల్: 2023 మార్చి నెలలో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల డిగ్రీ, పీజీ (అటానమస్)లో జరిగిన డిగ్రీ ఫస్ట్ ఇయర్ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ మాట్లాడుతూ బిఎ 90 శాతం, బికాం 84 శాతం, బిఎస్‌సి 71 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పరీక్షా ఫలితాలను సకాలంలో విడుదల చేసినందుకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ కెవి రామకృష్ణ, అసిస్టెంట్ కంట్రోలర్ ఎన్‌ఎస్‌విఎన్‌ఎ కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ట్రెజరర్ నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, పరిపాలనాధికారి డి.సుబ్బారావు, అధ్యాపకులు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను అభినందించారు.

వృద్ధులకు రాయితీ పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - వీరవాసరం

రైల్వే వృద్ధ ప్రయాణికులకు గతంలో టికెట్‌పై ఉన్న రాయితీని పునరుద్ధరించాలని రైల్వే పాసింజర్స్ అసోసియేషన్ రైల్వే అధికారులను కోరింది. ఈ మేరకు రైల్వే అధికారులకు లేఖ రాసినట్టు అసోసియేషన్ ప్రెసిడెంట్ సబ్బారపు వెంకట్రావు బుధవారం తెలిపారు. కరోనా ముందు ఉన్న ఈ రాయితీని కరోనా తరువాత పునరుద్ధరించకపోవడం వల్ల పేద వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్యాల వల్ల పలువురు వృద్ధులు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితులు నిత్యం ఎదుర్కొంటున్నారని అటువంటి వారికి రాయితీలేక పోవడం వల్ల వైద్య ఖర్చులతో పాటు రైల్వే ప్రయాణం ఆర్థిక భారంగా మారిందన్నారు. వృద్ధుల రైల్వే టికెట్‌పై ఉన్న రాయితీని తక్షణం పునరుద్ధరించాలని ఆయన కోరారు.

మావుళ్లమ్మ సన్నిధిలో మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి - భీమవరంరూరల్

మావుళ్లమ్మ అమ్మవారిని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉషశ్రీచరణ్ బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రికి ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల. మల్లికార్జునశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి ఫొటో, ప్రసాదాలను అందజేసి వేద ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ అధికారి బి.సుజాతారాణి, ఆలయ ఛైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, ధర్మ కర్తలు పాల్గొన్నారు.

కంటి వెలుగును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గణపవరం

ప్రభుత్వం గ్రామాల్లో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కేశవరం గ్రామ సర్పంచి మిడతాని కామేశ్వరి నాగేశ్వరావు అన్నారు. బుధవారం పిప్పర పిహెచ్‌సి ఆధ్వర్యంలో జరిగిన కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచి ప్రారంభించారు. మొత్తం 62 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపవరం సిహెచ్‌సి ఒ.జాలాది విల్సన్‌బాబు. హెల్త్ విజటర్ టివి సుబ్బలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

ప్రజాశక్తి - పాలకోడేరు

మండు వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని వీరవాసరం జెడ్‌పిటిసి గుండా జైప్రకాష్ నాయుడు, జనసేన ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. పెన్నాడలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య పేరున ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించారు. అలాగే 30 మందికి దుప్పట్లు, శానిటైజర్లు, మాస్కులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలకు సేవలనుంచే విధంగా వ్యవసాయ కార్మిక సంఘం సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో కూడా చలివేంద్రం కొనసాగింపునకు కృషి చేస్తామన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అశ్రియ్య మాట్లాడుతూ చలివేంద్రం ఏర్పాటుకు దాతలు అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, ఆర్‌ఐ నాగభూషణ్ రావు, విఆర్‌ఒలు సుబ్రహ్మణ్యం, శాంతారావు, నాయకులు సత్యనారాయణ, మధు పాల్గొన్నారు

దుంపగడప విఆర్‌ఒ మృతి

ప్రజాశక్తి - ఆకివీడు

మండలం దుంపగడప విఆర్‌ఒ కడిమి కిషోర్ మంగళవారం మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్న కిషోర్ సెలవు పెట్టి స్వగ్రామం నత్తారామేశ్వరం వెళ్లారని తహశీల్దార్ నండూరి వెంకటేశ్వరరావు చెప్పారు. అనంతరం ఆయన మృతి చెందారని బుధవారం కార్యాలయానికి కుటుంబీకులు సమాచారం ఇచ్చారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామంలో విఆర్‌ఒగా పనిచేస్తూ తొమ్మిది నెలల క్రితం కిషోర్ బదలీపై దుంపగడప విఆర్‌ఒగా వచ్చారు. ఆయన మృతికి వెంకటేశ్వరరావు, డిటి రాజు కిషోర్, విఆర్‌ఒ అసోసియేషన్ నాయకులు బందా ప్రసాద్, దానయ్య, విఆర్‌ఒలు సంతాపం తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఆకివీడులో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

కాళ్లలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

భానుడి భగభగ..

రోడ్లన్నీ నిర్మానుష్యం..
కానరాని చలివేంద్రాలు

ప్రజాశక్తి - కాళ్ల

ఎండలు మండుతున్నాయి. ఒక్కపక్క ఉక్కపోత, మరో పక్క అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణుల అవస్థలు వర్ణణాతీతం. వారం రోజుల నుంచి పగటిపూట ఉష్ణోగ్రతలు సగటున 36 నుంచి 38 డిగ్రీల వరకూ నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. ఈ నేపథ్యంలో పనులు చేసుకునేవారు, బాటసారులు దాహార్తితో అలమటిస్తున్నారు. గత వేసవిలో అనేక ప్రాంతాల్లో ప్రభుత్వ అధికారులు, నాయకులు చలివేంద్రాలు నెలకొల్పారు. ఈ ఏడాది ఇంకా ఎక్కడా కానరావడం లేదు.

ప్రధాన కూడళ్లలో ప్రజల అవస్థలు..

ఏటా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. బస్టాండు, పంచాయతీ, పోలీస్‌స్టేషన్, జువ్వలపాలెం, కలవపూడి, బొండాడ కోలనపల్లి రోడ్డు ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయడంతో బాటసారులు దాహార్తిని తీర్చుకునేవారు. ఈ ఏడాది మాత్రం ఆ ఊసే లేదు. మార్చి నుంచే ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా గ్రామ పంచాయతీ అధికారులు తమకేమీ తెలీదన్నట్లు వ్యవహరిస్తున్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో కూడా ఇదే పరిస్థితి.

కనిపించని ప్రచారం..

మండలంలో పగటి పూట ఉష్ణోగ్రతలు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. వేడి గాలులు వీస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించాలి. ఈ కాలంలో వచ్చే వ్యాధులపై అప్రమత్తం చేయాలి. అయితే ఎక్కడా అలాంటి కార్యక్రమాలు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు కరపత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా అలాంటివి ఎక్కడా జరగకపోవడం శోచనీయం.

ఆకివీడు: రెండు రోజులుగా పెరిగిన ఎండ తీవ్రతకు ప్రజలు విలవిల్లాడుతున్నారు. దీంతో ఉదయం 11 గంటల నుంచి జనం రోడ్లపైకి రావడానికి బెంబేలెత్తుతున్నారు. ఉద్యోగులు, పరీక్షలు రాస్తున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకూ రోడ్లన్నీ ఖాళీ అయిపోతున్నాయి. దీంతో రాత్రి పది గంటల వరకు మార్కెట్ కళకళలాడుతోంది. ఏప్రిల్‌లోనే ఎండలు ఈ స్థాయిలో ఉంటే మేలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పాలకొల్లు: నియోజకవర్గంలో వారం రోజులుగా ఎండ ప్రభావం ఎక్కువగా ఉంది. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్నం సమయంలో ప్రజలు బయటకు రాని పరిస్థితి నెలకొంది. ఏప్రిల్‌లోనే రోహిణి కార్తెలా ఉందని, మే లో ఇంకెలా ఉంటుందోనని జనం భయ పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు బయట తిరగడానికి భయపడుతున్నారు. దీంతో రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. వ్యాపారులు మధ్యాహ్న సమయంలో షాపులు కట్టేసి తిరిగి సాయంత్రమే తెరుస్తున్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా చర్యలు

ప్రజాశక్తి - తణుకురూరల్

ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. వేల్పూరులోని రైతు భరోసా కేంద్రం-4లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సకాలంలో గోనె సంచులు అందజేయాలని సూచించారు. రైతులు ఆర్‌బికెకు ధాన్యాన్ని తీసుకొచ్చే ముందు సమయాన్ని తెలియజేసి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తెలియజేశారు. రైతులకు ట్రాన్స్‌పోర్టు, గన్ని బ్యాగులకు, హమాలీ ఛార్జీలు చెల్లించనున్నట్లు తెలిపారు. ఒకవేళ వాటిని రైతులే ఏర్పాటు చేసుకుంటే వారి ఖాతాల్లోకి డబ్బులు జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ టి.శివరామప్రసాద్, జిల్లా పౌరసరఫరాల అధికారిని ఎన్.సరోజ, ఎడిఎ ఎంవి.రమేష్ పాల్గొన్నారు.

నవధాన్యాల కిట్లు సిద్ధం

వీరవాసరం: నవ ధాన్యాలు సాగుచేయడం వల్ల పంటచేలకు అధిక బలం చేకూరుతుందని వ్యవసాయ జిల్లా కో ఆర్డినేటర్ అరుణ కుమారి తెలిపారు. వేసవిలో నవధాన్యాలు సాగుకు అవసరమైన నవధాన్యాల కిట్లును బుధవారం నవుడూరు ఆర్‌బికె వద్ద సిద్ధం చేశారు. ఈ సందర్భంగా నవధాన్యాల వల్ల భూమికి తద్వారా పంటలకు చేకూరే లాభాన్ని రైతులకు వివరించారు. దాళ్వా సాగు అనంతరం పచ్చి రొట్ట పంటలు సాగు చేయడం వల్ల భూమి గుల్లబారుతుందని, తద్వారా భూమిని సారవంతం చేసే వానపాములు అభివృద్ధి చెందుతాయన్నారు. పచ్చి రొట్ట భూమిని సారవంతం చేసి దిగుబడిని పెంచడమే గాక పశువులకు దాణాగా ఉపయోగించుకుని పాల దిగుబడిని పెంచుకోవచ్చన్నారు. పచ్చిరొట్ట సాగుతో జీవవైద్యం పెరగడంతో పాటు పంటలను ఆశించే చీడపీడలను తట్టుకునే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కో ఆర్డినేటర్ చింతా వీరస్వామి, డివిజన్, మండల ఇన్‌ఛార్జులు స్వామి, రవికుమార్, అశోక్, శివకృష్ణ, నాగరాజు, సిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.

కెరియర్ గైడెన్స్‌పై అవగాహన

నరసాపురం రూరల్: నరసాపురం పరిసర ప్రాంతాల్లో పది పరీక్షలు రాసిన విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 20న వైఎన్ కళాశాల అరబిందో ఆడిటోరియంలో 'విద్యార్థి కెరియర్ గైడెన్స్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణ కమిటీ అధ్యక్షులు ఎమ్‌డి.జాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది పాలిసెట్ పరీక్ష రాసే పదో తరగతి విద్యార్థులకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర కళాశాలలో ఉచిత పాఇసెట్ కోచింగ్ ఇవ్వనున్నట్లు ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ కార్యదర్శి ఎ.మురళి తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

పాలకొల్లు: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 6వ రోజు బుధవారం హరిత హాస్పిటల్ వద్ద అక్కడ సిబ్బందికి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. డాక్టర్లు, నర్సులు, ఇతరులకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తమ, రోగుల ప్రాణాలు ఎలా రక్షించుకోవాలో డెమో ద్వారా చేసి చూపించారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి ఎవి.జానకిరామ్, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సిఎం జగన్ ధ్యేయం

ఉండి: పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయమని వైసిపి జిల్లా కార్యదర్శి మునుకోలు సింహాచలం అన్నారు. బుధవారం బాలాజీరావు పేటలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో మునుకోలు సింహాచలం పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి ప్రతి పేదవాడికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. గురువారంతో ముగియనున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని కార్యకర్తలందరూ వేగవంతం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కరిమెరక రామచంద్రరావు, గల్లావిల్లి ధనుంజయ, బడుగు బాలాజీ, గెద్దా భోగేశ్వరరావు పాల్గొన్నారు.

'జగన్‌ది నియంత పాలన'

ప్రజాశక్తి - భీమవరంరూరల్

బేతపూడి, తాడేరు గ్రామాల్లో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం టిడిపి మండల అధ్యక్షుడు రేవు వెంకన్న ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని చూసిన ప్రజలు జగన్ నియంతపాలనను చూసి తిట్టుకుంటున్నారని విమర్శించారు. వైసిపి కార్యకర్తలు జగన్ పరిపాలనతో విసుగుచెంది టిడిపి వైపు చూస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ రావు, భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడును తిరిగి ముఖ్యమంత్రి చేసే వరకు ప్రతిఒక్కరూ కష్టించి పనిచేయాలన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడారు. అనంతరం వైసిపి అంగర రంగారావుతోబాటు మైలాభత్తుల ప్రవీణ్ వీరవల్లి వీరబాబు, జుత్తిగ నాగేంద్ర, బలగం దావీదు, యాతం సత్యనారాయణ, 50 మంది అనుచరులు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

జెడ్‌పిటిసి సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఆకివీడు

తల్లిపై ఉన్న మమకారంతో స్థాపించిన సేవా సంస్థ ఆధ్వర్యంలో జెడ్‌పిటిసి సేవలందించడం అభినందనీయమని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. జిల్లా పరిషత్ సభ్యులు వేగేశ్న వెంకటరాజు (యండగండి శ్రీను) తన తల్లి మరణానంతరం ఆమె జ్ఞాపకార్థం వేగేశ్న సరోజినీ ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. ఈ ట్రస్ట్ ద్వారా బుధవారం చినకాపవరంలోని ఆయన నివాసం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నరసింహరాజు ప్రారంభించి మాట్లాడారు. ముందుగా సరోజినీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైద్య శిబిరంలో స్థానిక స్టార్ ఆఫ్ హోప్ ఆసుపత్రి వైద్యులు సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు కేసిరెడ్డి మురళీ, నంద్యాల సీతారామయ్య, గుండా సుందరరామ నాయుడు (చిన్ని), ఎంపిపి కటారి రాజ్యలక్ష్మి, బత్తుల శ్రీనివాసు పాల్గొన్నారు.

23న గురుకులంలో ప్రవేశాలకు రాత పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఎపి సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 23న రాతపరీక్ష నిర్వహించనున్నట్లు అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలో పాల్గొనే విద్యార్థులకు ఇప్పటికే ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు పెట్టినట్లు తెలిపారు. పరీక్షల్లో పాల్గొనే ప్రతి విద్యార్థి నిబంధనలను పాటించాలని సూచించారు. మాస్క్ తప్పనిసరిగా వాడాలని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఐదవ తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఎపి జిపిసిఇటి.ఎపిసిఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ వెబ్‌సైట్లో ఐదో తరగతి విద్యార్థులు, ఎపి జిపిసిఇటి. ఎపిసిఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్ టిఇఆర్ వెబ్ సైట్లో ఇంటర్ విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్లోడ్ చేసుకోవాలని తెలిపారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

కుముదవల్లిలో ఇంటి పన్ను కడుతున్న ప్రతి గృహానికీ రాబోయే రోజుల్లో కుళాయి కనెక్షన్ మంజూరు చేయనున్నట్లు డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు హామీ ఇచ్చారు. జల జీవన్ మిషన్‌లో భాగంగా గ్రామానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయని, పైప్‌లైన్ ఏర్పాటు చేసి ప్రతిఇంటికీ కుళాయి కనెక్షన్ మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామంలో బుధవారం సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు, గ్రామ సర్పంచి భూపతిరాజు వంశీకృష్ణమరాజు ఆధ్వర్యంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ గ్రామంలో కొన్నిచోట్ల డ్రెయినేజీ, తాగునీరు సమస్య ఉందని గ్రామస్తులు తమ దృష్టికి తెచ్చారని, సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు (చంటిరాజు), సర్పంచి భూపతి రాజు వంశీకృష్ణంరాజు మాట్లాడుతూ గడపగడపకూ తిరుగుతుంటే ప్రజాధరణ విశేషంగా వస్తోందన్నారు.

పథకాల పట్టికను అందజేస్తున్న పివిఎల్, ఎంపిపి

నియోజకవర్గంలో పివిఎల్‌ను ఎంఎల్‌గా గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఆలిస్ మేరీ, ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీతులసి, ఉపసర్పంచి వడ్లమూడి ముసలయ్య, వైసిపి ముఖ్య నాయకులు రవికుమార్ రాజు, తంగేళ్ల నరసింహారావు, సుబ్రహ్మణ్యం, అంగర రాజు సత్తిబాబు, చేకూరి రాజా నరేంద్రరాజు, కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు పాల్గొన్నారు.

కమ్ముకున్న మంచు

పెనుమంట్ర: బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి మంచు అధికంగా కురిసింది. దీంతో ప్రధాన రహదారుల్లో సైతం మంచు కమ్మేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా బ్రాహ్మణచెరువు, నత్తారామేశ్వరం - పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు - మార్టేరు రహదారుల్లో మంచు ప్రభావం ఎక్కువగా ఉంది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. అయితే వరిపై మంచు పరదా కమ్మేయడంతో స్థానికులు ప్రకృతి అందాన్ని ఆశ్వాదిస్తున్నారు.

5 కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని ఆచంట వేమవరం నక్కల కాలువ సమీపంలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న నలుగురు యువకులను బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పెనుగొండ పోలీస్ స్టేషన్లో సిఐ నాగేశ్వరరావు వివరాలు వెల్లడించారు. పాలకొల్లుకు చెందిన గుణా మణిరత్నం, ఖండవెల్లికి చెందిన కౌశిక్, ఆనంద్, యు, సుధీర్ బాబును అరెస్టు చేశారు. వీరిలో ఒకరు మైనర్. వీరి వద్ద నుంచి సుమారు రూ.25 వేల విలువైన ఐదు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరంతా జల్సాలకు అలవాటు పడ్డారని తెలిపారు. ఆచంట వేమవరంలో అక్రమంగా గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మైనర్‌ను ఏలూరు తరలించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రాజకుమార్ పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

మా క్లయింటు అయిన కతారి నాగమల్లేశ్వరరావు s/o. సీతారామయ్య, వెంకటాపురం గ్రామం, పెదపాడు మండలం, ఏలూరు జిల్లా వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఏలూరు జిల్లా, పెదపాడు మండలం, పెదపాడు పార్ట్ -1 రెవెన్యూ గ్రామంలోని ఆర్.యస్.నెం. 156/1 రు దాఖలా య.0-50ట్లు భూమి మా క్లయింటు పేర ఏలూరు ఆర్.వో.లో దస్తావేజు నెం. 2763/1996 రుగా రిజిష్టరు కాబడినది.

సదరు నెం. 2763/1996రు గల ఒరిజినల్ క్రయదస్తావేజు పెదపాడులోని బండిరోడ్డు సెంటర్ మార్గంలో పడిపోయినవి. సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్‌కి తెలియపర్చగలరు.

Tigiripalli Subbarao, Advocate, Eluru
Cell : 94400 20815

ప్రకటన

నా క్లయింటు అయిన దెందులూరు మండలం, కొవ్వలి గ్రామ కాపురస్తుడు **(లేటు) మొటపర్తి సత్యనారాయణ గారి కుమారుడు వెంకట నాగ పూర్ణచంద్రరాజు** ఇచ్చిన సంజాయిషీ మేరకు,

నా క్లయింటు తండ్రి గారు ది. 25-08-2011 తేదీన ఆయనకు గల స్థిరాస్తులకు సంబంధించి ఏలూరు రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిస్ట్రరు వీలునామా నెం. 323/2011, బుక్-3 గా రిజిస్టర్ చేయించి వారు ఆ వీలునామా ప్రకారం కొవ్వలి గ్రామ ఏరియాలో గల పొడి దొడ్డిచేను ఆర్.యస్. నెం. 763/2 రు య. 3-40 సెంట్లు కలదు. సదరు ఆస్తికి సంబంధించి డాక్యుమెంట్స్‌ను జిరాక్స్ తీయించు నిమిత్తము దెందులూరు గ్రామం వెళ్ళి జిరాక్స్‌లు తీయించుకొని తిరిగి అతని కొవ్వలి గ్రామం వెళు తుండగా మార్గమధ్యంలో దస్తావేజులు గల సంచి దస్తావేజులుతో సహా పడిపోయినవి. ఆ దస్తావేజులు నా క్లయింటుకు చాలా అవసరము అయి వున్నవి. కావున దొరికినవారు ఈక్రింది అడ్రస్సుకు అందచేసి తగిన బహుమానం పొందవలసిందిగా కోరుచున్నాము.

ఏలూరు, ది. 19-04-2023

VELAGAPUDI VENKATESWARA RAO
G.VENKATA RAMANA
Advocates, Kovvali (P), Denduluru (M)
Pin: 534442, Eluru District
Cell: 9948832892

పత్రికా ప్రకటన

మా క్లయింట్ అయిన నూకల అమ్మాజి గారు, W/o. నూకల రామకృష్ణ గారు ఇంటి నెం. 7B-15-45, మారుతి నిలయం, ఉప్పువారి వీధి, తూర్పు వీధి, ఏలూరు, ఏలూరు జిల్లా వారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఏలూరు జిల్లా దెందులూరు మండలం, భీమడోలు సబ్-డివిజన్ చేరిన ముప్పవరం గ్రామంలో ఆర్.యస్. నెం. 39, దాఖల య. 2-58 ట్లు భూమి అయిన మా క్లయింట్‌కి చెందిన లింకు దస్తావేజు నెం. 699/97 గా రిజిస్టర్ కాబడింది. సదరు దస్తావేజు నెం. 699/97 గల ఒరిజినల్ క్రయ దస్తావేజు (లింక్ దస్తావేజు) ఏలూరు, ఆర్.ఆర్.పేట సెంటర్ మార్గంలో పడిపోయినది. సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియచేయగలరు.

మల్లెల శ్రీ గోపాలకృష్ణ, అడ్వకేట్
డోర్ నెం. 6బి-2-87, పోణంగి రోడ్
దక్షిణపు వీధి, ఏలూరు-534001
సెల్: 9885576667

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ 1వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి - కమ్ - 1వ అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ 1st క్లాస్ కోర్టు, తాడేపల్లిగూడెం నందు

యమ్.సి. నెం. 87/2022

ముత్యాల దుర్గాంబ -వాది

మరియు

ముత్యాల వెంకట్రావు, తండ్రి: వెంకటేశ్వరరావు, ఆరుగొలను గ్రామము, తాడేపల్లిగూడెం (మండలము), ప॥గో॥జిల్లా. -ప్రతివాది

పైన పేర్కొన్న యమ్.సి. నెం. 87/2022 గల కేసు ది. 21-04-2023వ తేదీన ప్రతివాది అయిన శ్రీ ముత్యాల వెంకట్రావు హాజరు కొరకు వచ్చుచున్నది. శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల మేరకు పత్రికాముఖంగా ప్రతివాది గారైన శ్రీ ముత్యాల వెంకట్రావు గార్కి తెలియజేయడమైనది. సదరు వాయిదా తేదీన అనగా **ది. 21-04-2023వ తేదీన** ప్రతివాది గారు పైన పేర్కొన్న కోర్టు ముందు **ఉదయం గం॥ 10.30 ని॥లకు** స్వయముగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరు కావలెనని తెలియజేయడమైనది. ప్రతివాది సదరు కోర్టు ముందు హాజరు కాని యెడల ప్రతివాది పరోక్షమున శ్రీయుత కోర్టు వారు ఉత్తర్వులు వెలువరించగలరు అని ఈ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

KARNATI KANNAYYA, Advocate
Tadepalligudem, Cell: 9966446473

మహారాజశ్రీ తణుకు Ist Addl. జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

I.A. 208/2023 in O.S. 56/2023

Between:

పిటీషనరు/వాది: చెన్నా ఆదిలక్ష్మి

AND

రెస్పాండెంట్లు/ప్రతివాద్లు: దాసం సావిత్రి వగైరా

R3/ D3: దాసం శ్రీనివాసరావు, S/o. వీర రాఘవులు, 45 సం॥లు, వ్యవసాయం, కానూరు అగ్రహారం, పెరవలి మండలం, TDMC.

పిటిషనరు వారి తరపు దాఖలు చేసిన పేపరు ప్రకటన

పై నెంబరు గ్రంథము **ది. 03-5-2023వ తేదీన వాయిదా అయి వున్నది.** సదరు గ్రంథములో రెస్పాండెంట్/ప్రతివాది I.A. 208/2023 మరియు దావాలోను ఎన్నిసార్లు సమను, నోటీసు పంపినప్పటికి తీసుకోకుండా Avoid అగుచున్నందున పై పేపరు ప్రకటన ద్వారా తెలియపర్చుడమైనది. సదరు తేదీన R3/D3 రెస్పాండెంట్/ ప్రతివాది స్వయంగాను గాని లేదా వకీలు ద్వారా గాని **ఉదయం 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరు అయి కావలసి ఉన్నది. లేని ఎడల మీపై పరోక్షముగా దావా తీర్మానించబడును అని యిందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

మంగిన శ్రీనివాస మెహర్‌బాబా
తణుకు అడ్వకేట్, తణుకు
ది.18-4-2023 సెల్: 7013318947

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd Additional Junior సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 594/2022

Plaintiff: Kalavaguntla Rambabu

Defendant:

Bodaballa Srinivasarao @ Srinivas

To:

Bodaballa Srinivasa Rao @ Srinivas, S/o. Subbarao, Door No. 11-22-32/1A, Narasimharaopeta, Tadepalligudem-2, TPG SCJC.

పై నెంబరు దావాలో ప్రతివాది ఎన్నిసార్లు దావా సమన్లు పంపినను దావా సంగతులు తెలిసియుండి సదరు సమన్లు తీసుకొనకుండా Evade చేయుచున్నందున Substituted Service ద్వారా అమలు జరుపుటకు వుత్తర్వులు ఇచ్చి **ది. 26-06-203కి వాయిదా వేసియున్నారు. కావున మీరు సదరు వాయిదా రోజున ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్షమందు పై నంబరు దావా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

K.SIVA RAMAKRISHNA
Advocate for Plaintiff
Tadepalligudem Tadepalligudem-534101
Date: 17-04-2023 Cell: 9493480288

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2nd Additional Junior సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P. 24/2022 in O.S. 312/2021

Decree Holder: Annamreddi Subbarao

Judgement Debtor: Boddu Nethiyya

పై నంబరు డిక్రీ బాకీకి గాను ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి వేలం నిమిత్తం ది. 12-05-2023 కి వాయిదా వేసియున్నారు. కావున కావలసినవారు **ది. 12-05-2023న ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టుకు వచ్చి పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.

SCHEDULE

West Godavari District, Tadepalligudem Sub Registrar, Tadepalligudem Mandalam, Pullayigudem Grama Panchayati, area H/o. Apparaopeta, Pullayigudem Village, R.S. No. 511 Near by Door No. 2-63 to an extent of 145 sq.yards of site and RCC roof building therein within the following boundaries.
EAST: Pedamurthi Venkateswararao building.
SOUTH: Dirsipo Polayya building
WEST: Main Road.
NORTH: Panchayati cement Road.

Within the above boundaries an extent of 145 sq.yards of site and RCC roof building with all easement rights.

D.Hr. Value: Rs. 4,00,000/-
Amin Value: Rs. 10,00,000/-

There are no encumbrance on the schedule property as per E.C.

KUSULURI SIVA RAMAKRISHNA
Advocate for D.Hr
Tadepalligudem Tadepalligudem-534101
Date: 16-04-2023 Cell: 9493480288